# మోపిసం డుమానసు

మల్లేశ్వరి

రాత్రి పదవుతూంది. చినుకులు చిటపట మంటున్నాయి. పెట, పెట లాడే వయసులోవున్న ఓ అమ్మాయి అప్పుడే ఆగిన బస్సులోంచి బితుకు, బితుకు మంటు ఒక్కతే దిగింది. కర్తవ్య నిర్వహణగ్గాను కదలి వెళ్ళిపోయింది బస్సు గమ్యం చేరడంకోసం. అడవి లాటి ఆ ప్రదేశంలో, చెట్లలా నిలబడివున్నవి కరెంటు స్తంభాలు. వాటికి వ్రేలాడుతున్న లైట్లనుండి ప్రసరించే కొద్ది వెలుగు ఆ అమ్మాయికి చిరుధైర్యాన్నిచ్చింది. అయినా తన వయసు, అందం ఆ ఒంటరితనంలో ముప్పని గ్రహించింది. మరుక్షణమే, 'ఈరాత్రి ప్రయాణం మానుకునివుంటే బావుండేది' అని తనను తాను నిందించుకుంది సూట్ కేస్ ప్రక్కన పెట్టి నిల్చుంది.

వర్షం జోరు ఎక్కువైంది....చుట్టూ పరికించింది. ప్రక్కనేవున్న రేకుల షెడ్డులోకి చేరుకుంది గుండెలు బిగపట్టుకుని, లేని ధైర్యం తెచ్చుకుంటు.

అక్కడే పేకాడుతున్న నలుగురు ఆ అప్సరసను కని, ఒకింత ఆశ్చర్యపడ్డారు....మరింత ఆనంద పడ్డారు.... వెకిలిగా నవ్వారు....ఆమె గుండె ధైర్యం జారిపోయింది.... వాళ్ళు చొరవ తీసుకోబోయారు....పాముని చూచిన కప్పలా భయంతో బయటకు గెంతింది వానను లెక్కపెట్టకుండ. నలుగురు ఆ అమ్మాయిని వెంబడించారు. గుండెల్ని గుప్పెట్లో పెట్టుకుని రెండు ఫర్లాంగులు పరుగిడింది. తప్పతాగి వున్నారు కాబోలు.... తప్పటడుగులు వేస్తున్నారు నలుగురు. ఎంత ప్రయత్నించినా ఆ అమ్మాయిని అందుకోలేక పోయారు.

చీకట్లో ఆశాకిరణంలా, వీధి దీపాల గుడ్డి వెల్తుర్లో ఓ ఇల్లు లీలగా గోచరించింది. అమ్మాయి ఆయాసంతో ఆగింది ఇక పరుగిడలేక. ఆత్రంతో తలుపును 'దబ, దబ' బాదింది.

పులినోరులా తెరుచుకుంది ద్వారం. పులినోట్లోని నాలుకలా, ఎర్రని దుస్తుల్లో వున్న ఓ ముప్పయ్యేళ్ళ యువకుడు, తలుపు తెరిచాడు. గబుక్కున లోపలికెళ్ళి గడియపట్టేసింది ఆ అమ్మాయి భయంతో. గడియపెట్టి ఊపిరి పీల్చుకుంది. ఆ యువకుడు విస్తుపోయాడు.

చేజారిపోయిన అవకాశాన్ని తల్చుకుంటూ, నిరాశతో వెనుతిరిగి పోయారు నలుగురు రౌడీలు.

కిటికీలోంచి చూసి, పరిస్థితి అర్థం చేసుకున్నాడు యువకుడు. "మీ కేం పర్వాలేదు.... నేనున్నాను.... నాపేరు చంద్ర బాబు— బహుళా రచయిత చంద్ర బాబంటే మీకు వెంటనే గుర్తొస్తుందనుకుంటా.... నేను చాలా పత్రికల్లో కథలు, సీరియల్స్ రాస్తుంటాను.... ఇక్కడ మీ కొచ్చిన భయమేమీలేదు.... రండి" అంటూ హాలులోకి తీసుకెళ్ళాడు మౌనంగా సూట్ కేసుతో అతన్ననుసరించింది.

"అలా కూర్చోండి" కుర్చీ చూపించాడు.

"థ్యాంక్స్" అమ్మాయి ఒదిగి కూర్చుంది. తడిసిన చీర శరీరానికి అతుక్కుపోయింది. అతని చూపులు ఆమెను ఓసారి ఆద్యంతము పరిశీలించాయి. అది గమనించిన ఆమె ప్రక్కకు తిరిగి తన గుండెల్ని చేతుల్తో కప్పుకుంది.

"అరెరె.... మీరు బాగా తడిసి పోయారు. తలతుడుచుకుని డ్రస్ చేంజ్ చేసుకోండి" హాంగర్ కున్న టవలందించి, కిచెన్‌లోకి దారితీశాడు, ఆమె జవాబుకు ఎదురు చూడకుండ.

దుస్తులు మార్చుకుని, ఇంటిని పరిశీలిస్తూ కూర్చుంది. నీట్‌గా, చక్కగా సర్ది వుంది ఇల్లు. కాని ఆడవాళ్ళున్న సూచనలు లేవు గోడకు వ్రేలాడుతున్న ఫొటోలో, చంద్రబాబు ప్రక్కన, ఓ యువతి వుంది. 'బహూశా భార్యయి వుండొచ్చు' మనసులోనే అనుకుంది ఆ అమ్మాయి.

ఇంతలో టీ కప్పుల్తో వచ్చి, ఆ అమ్మాయి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు చంద్రబాబు.

"మీకు శ్రమిచ్చాను" నసుగుతూ అంది.

"అబ్బె.... ఇందులో శ్రమేముంది. మా ఆవిడ పురిటికి పుట్టింటికి వెళ్ళి మూడ్నెల్లయింది. అప్పట్నుంచి ఇదంతా నా కలవాటే.... అన్నట్టు అడగటం మరిచాను, మీరు ఒంటరిగా.... ఇంత రాత్రివేళ ఎక్కడ్నుంచి వస్తున్నారో.... మీ పేరేమిటో తెలుసుకోవచ్చా.... అదీ మీ కభ్యంతరం లేకపోతే" టీ కప్పు అందిస్తూ అన్నాడు.

"నా పేరు సుశీలండి.... ఈ ఊళ్లోనే ఓ బ్యాంక్‌లో టైపిస్టుపోస్టు ఇంటర్వ్యూ కొచ్చాను. ఇంటర్వ్యూ కార్డు ఆలస్యంగా అందడంవల్ల లాస్టు బస్సులో మా ఊర్నుంచి రావల్సి వచ్చింది. ఇక్కడే మా పిన్నివరసయే దూరపు బంధువు ఒకావిడ వుంది. ఇల్లు వెతకడానికి ఈ రాత్రిపూట కష్టమేనని తెల్సినా ఇంటర్వ్యూకు సకాలంలో అందుకోవడానికి ఈ రాత్రిపూట ప్రయాణం చేయక తప్పిందికాదు. వీధి చివర వున్న స్టాపులో బస్సుదిగాను, ఎక్కడ దిగాలో తెలియక. ఇంతలో ఈ అవాంతరం జరిగింది. దేవాలయంలాంటి ఈ ఇంట్లో కొచ్చిపడ్డాను. దేవుళ్ళా మీరు నన్నాదుకున్నారు. ఈ విచిత్ర పరిస్థితుల్లోనే,

గొప్ప రచయిత ఐన మిమ్మల్ని కలవడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అంటూ తన కధంతా చెప్పుకుంది సుశీల.

"నేనూ మిమ్మల్ని యాదృచ్ఛికంగా చూడటం — అంటే నాకు మీ దర్శన భాగ్యం కల్గటం ఎంతో ఆనందంగావుంది. కధల్లో వర్ణించడమేగాని, ఇంత అందాన్ని ఇదే మొదటిసారి నా కళ్ళతో చూడటం" సుశీలవైపు అదోలా చూస్తూ అన్నాడు.

ఆమె కళ్ళు దించేసుకుని మౌనంగా వుండిపోయింది.

"అరెరె!.......మీరు హర్టయినట్టున్నారు. నేను తప్పుగా మాట్లాడివుంటే క్షమించండి." నొచ్చుకున్నట్టుగా అన్నాడు.

"అబ్బెబ్బె. అదేం లేదు. మీరు రచయితలు గదా! ఏది మాట్లాడినా రచనా దృష్టితోనే మాట్లాడుతారు ....మీ రచనలు చాలా బాగుంటాయి."

"నిజంగానా!" అన్నట్టు చూశాడు.

"ఎంతో ఉదాత్తంగా, సందేశాత్మకంగా, మరెంతో ఇంటరెస్టింగ్ గా వుంటాయి మీ కథలు. మీరు స్త్రీని దేవతగా, పవిత్రమూర్తిగా సృష్టించడం ఎంతో ముదావహం. 'శిల రక్షణ' అన్న మీ రచనలో 'ఆకలికి ఆహారం' అవుసరం. స్త్రీకి శీలం అవుసరం.... కోట్లిచ్చినా కొనలేనిది శీలం.... అదే పవిత్ర భారతదేశ సంకేతం' అన్న వాక్యాలు నా మనసులో ఇంకా ప్రతిధ్వనిస్తున్నాయి. స్త్రీని ఇంత గొప్పగా సృష్టించిన మీకు ఎలా ధన్యవాదాలు చెప్పుకోవాలో తెలియడంలేదు." ఉద్వేగంతో అతన్ని ప్రశంసించింది.

"మీరు నన్ను....మరీ పొగిడేస్తున్నారు....టీ చల్లారి పోతూంది తీసుకోండి" నవ్వుతూ తనూ కప్పు అందుకున్నాడు.

రాత్రి పన్నెండు వరకూ కబుర్లు చెప్పుకున్నారు. అటు తర్వాత సుశీల, హాలు ప్రక్కనే వున్న పడక గదిలోను, చంద్రబాబు హాల్లోను పడుకున్నారు.

"చంద్రబాబు మనసు వెన్నెలలా చల్లనిది, తెల్లనిది....ఇంత రాత్రివేళ ఈ ఇంట తనకు ఆశ్రయం లభించడంవల్లనే తను బతికిపోయింది. లేకపోతే ఆ రౌడీల చేతుల్లో తన జీవితం నాశనమైయుండేది." చంద్రబాబుకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ నిద్రకొరిగింది సుశీల.

చంద్రబాబుకు మాత్రం నిద్ర పట్టలేదు. తనెంత పెద్ద రచయితయినా, ఎన్ని నీతులు రాసినా, ఆదర్శాలు వల్లించినా—ఈ రాత్రివేళ, చలిలో, అపురూప సౌందర్యవతి, కన్నెపిల్ల, సమీపాన్నుంటే అతనికెలా నిద్రొస్తుంది? అందునా మూడు మాసాలుగా స్త్రీ స్పర్శకు నోచుకోనివాడు.

ఆలోచిస్తూనే తెల్లవారుఝాము ఐదు గంటలవరకు గడిపాడు. అతనికిగాని, అతనిలోని కొరికలకుగాని నిద్రే రాలేదు. పైగా అతనిలోని వివేకం మాత్రం నిద్రపోయింది. మూర్ఖత్వం ఆసరాగా.

ప్రజ్వరిల్లే కోరికలు అతన్ని సుశీల గదిలోకి నడిపించాయి.

సుశీల అమాయకంగా నిద్రిస్తూంది. చీర తొలగి ఆమె వక్షస్థలం ఆచ్ఛాదన లేక లైటు కాంతిలో అందాల్ని వెదజల్లుతుంది.


చంద్రబాబు ఇక ఆగలేకపోయాడు. విజృంభించిన కోరికలు కళ్ళాల్ని త్రెంచుకున్నాయి. ఎగిసిపడే సుశీల గుండెల్ని అదిమి పట్టాయి. ఎర్రని పెదిమల్ని ముద్దెట్టుకున్నాయి. పసిమి ఛాయ నున్నటి శరీరాన్ని స్పృశించాయి.

మెలుకువ వచ్చిన సుశీలకు ఏం జరుగుతుందో తెల్సుకునేటప్పటికి, చంద్రబాబు తనని ఆక్రమించుకుని వున్నాడు ఒక్కసారిగా ఆమెలోని బలం కట్టలు తెంచుకుంది. "వదలండి....నన్ను వదలండి....గొప్ప ఆదర్శాలుగల రచయిత.... మీరేనా ఈ అఘాయిత్యానికి పాలుపడ్డారు.... ప్లీజ్!.... ....నా జీవితాన్ని నాశనం చేయకండి" ప్రాధేయపడింది....ఏడ్చింది....కానీ చంద్రబాబు చెవులు మూసుకపోయాయి. అబల సబలయ్యింది....కాలితో గట్టిగా ఒక్క తోపు త్రోసింది. మంచంపైనుండి, గోడకు చేరగిలపడి నుదురు చిట్లింది చంద్రబాబుకు.

"సుశీలా! పిచ్చిగా ప్రవర్తించకు. నాకు లొంగిపో. నన్నానందపర్చు. ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాను.... నిముషాల్లో నీకు ఉద్యోగం వేయిస్తాను" పైకి లేచి నిలబడి రొప్పుతూ అన్నాడు.

"ఛీ! ఛీ! నీతులు చెప్పే నీమనసు ఇంతగా కుళ్ళిపోయిందా! పిచ్చిగా, మూర్ఖత్వంగా ప్రవర్తించినది ఎవరు? నా దగ్గరకు రాకు ...వచ్చావంటే నేనేం చేస్తానో నాకే తెలియదు...." చేతి కందిన ఫ్లవర్‌వాజ్ అతనికి గురిపెట్టి, గర్జించింది సింహంలా.

"నీతి .... నీతి .... నేతిబీరకాయలో నెయ్యి ఎంత వుంటుంది? అంతే నీతి. నీతులు పలికే వాళ్ళ మనసులోనూ వుంటుంది....గుడికెళ్ళే ప్రతివాడు భక్తుడే కానక్కర్లేదు....అలాగే 'ప్రజారక్షణ' అంటూ నినాదాలు చేసే నాయకులు భక్షణ చేసే వినాయకులు కావడం లేదా! సీతపాత్ర నటించే సినీనటి పచ్చిగా పదిమంది భర్తలను మార్చడం లేదా! నేనూ అంతే....ఈ లోకమే అంతే!....ఎక్కడుంది నీతి? ఎక్కడుంది న్యాయం?....సినిమాల్లో చూసేది, రచనల్లో చదివేది, అంతా మిధ్య....నిజజీవితానికి, దానికి సంబంధంలేదు. కాలానుగుణ్యంగా ప్రవర్తించడమే న్యాయం, నీతి....అందునా మనవాళ్ళు అననే అన్నారు 'కామానికి కళ్ళు లేవని!'....అందుకే ఈ అవకాశాన్ని జారవిడచుకోలేను.... నా కోరిక తీర్చు" విచక్షణ జ్ఞానం నశించింది చంద్రబాబులో. చంద్రబాబు, సుశీలపైకి రాసాగాడు. మెరపులా ఓ ఆలోచన తోచింది సుశీలకు. వెంటనే క్రిందకు వంగి, అతను నడుస్తున్న తివాసీ లాగింది. ఫ్లవర్‌వాజ్ అతనిపైకి విసిరింది. నుదురుచిట్లి మరింతగా రక్తం కారసాగింది వెర్రికిలా



పడ్డాడు. అదే అదనని ఎంచి, గది బయటకు వచ్చి, గడియ పెట్టింది.

"సుశీలా! తలుపు తెరు తలుపు తెరు!" గాయం వల్ల కల్గిన బాధతో అరవసాగాడు చంద్రబాబు.

సుశీల కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. మోము అరుణిమ దాల్చింది. ఉచ్ఛ్వాస, నిశ్వాసాల్తో గుండెలదురుతున్నాయి.

"హుఁ! తలుపు తెరవాలా! ముందు నీ కళ్ళు తెరచుకో!....కామంతో మూసుకపోయావని అన్నావుగా!....నీ పేరుకు తగ్గట్టు నీ కథలు వెన్నెల చల్లదనాన్ని చిందిస్తే, నీ మనసూ చల్లనిదని, పాలలా తెల్లనిదని, స్వచ్ఛమైనదని భ్రమపడ్డాను. నల్లని మురికిగుంట లాంటిదని, ఇంత కంపుకొడ్తుందని, తెల్సుకోలేకపోయాను. పాముల్లాంటి రౌడీల చేతుల్లోంచి, పులిబోనులోనికి వచ్చానని గమనించలేకపోయాను. 'శీలం....శీలం' అని గోలచేసే నీ రచనల్ని కాల్చి పారేయి. నీ నల్లని మనసుతో, తెల్లని కాగితాల్ని, తెల్లని హృదయాల్ని పాడు చేయకు. నువ్వసలు శీలం పేరెత్తడానికే అనర్హుడివి. గోముఖ వ్యాఘ్రానివి!.... మూర్ఖుడివి!....ఒకటిమాత్రం గుర్తుంచుకో!....కోటి కోట్లిచ్చినా కొనలేనిది శీలం....నీవు రాసిన మాటే నీకు గుర్తు చేస్తున్నాను!....వస్తా!" అంటూ అతన్ని పలువిధాలుగా దుయ్యబట్టి, సూట్ కేస్ తీసుకుని, చెదరిన వెంట్రుకల్ని సరిచేసుకుంటు, విసురుగా వీధిలోకి వచ్చింది.

అప్పుడే తూర్పు తెల్లబడుతోంది. శీలాన్ని కాపాడుకున్నానన్న తృప్తి, సుశీల ముఖంలో ప్రకాశించింది.